క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ఆలయం వద్ద మధ్యాహ్నం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల సాయం



ఆలయ నిర్మాణ కమిటీకి నగదు అందజేస్తున్న సీతబాబు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన ఏపీఎస్ఈబీ ఏఎమ్ అడ్డూరి సీతబాబు రూ.51,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దాసరి రవి, ఆదిబాబుకు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం నగదు అందజేశారు.

వీధి లైట్ల ఏర్పాటు



వావిలపాడులో వీధిలైట్లు వేస్తున్న సిబ్బంది

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ పంచాయతీలో ఇది వరకు వేసిన వీధి లైట్లలో పాడైన వాటి స్థానంలో, కొత్తగా కొన్ని విద్యుత్ స్తంభాలకు ఆదివారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. పంచాయతీ నిధులతో 105 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని సర్పంచ్ బీల రాజేశ్వరి తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, వీధి లైట్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చెత్తను వీధుల్లో, కాలువల్లో పారబోయకుండా డస్ట్‌బిన్‌లలో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ప్రజలకు సూచించారు.

రైల్వే ప్రయాణికులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వికాస్‌నాయక్

కొత్తవలస: రైలు ఎక్కే సమయంలో, ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఎస్ఐ వికాస్‌నాయక్ ప్రయాణికులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై నిర్లక్ష్యంగా నిలబడడం, పట్టాలు దాటడం, భోగీల్లో మెట్లపై నిల్చోడం, నడుస్తున్న రైలు ఎక్కడం వంటి చర్యలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, నడుస్తున్న రైలు ఎక్కడం చేయవద్దని సూచించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం

శృంగవరపుకోట: పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకమని భారతీయ జనతాపార్టీ నాయకుడు డి.దాశరథి అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో బీజేపీ నేత యలమంచిలి ప్రసాద్ నేతృత్వంలో మండల పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి మాట్లాడుతూ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్‌కు అధ్యక్ష, కార్యదర్శులను నియమిస్తూ, వారి కార్యాచరణ రూపొందించడం, కార్యనిర్వహణను నిర్దేశించడం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్.ఆర్.వి.రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి తీర్థం



కొత్తవలస: పూజలందుకుంటున్న శ్రీ సీతారామలక్ష్మణులు



కొత్తవలస: కోలాటం ఆడుతున్న మహిళలు



వేపాడ: రాయుడుపేటలో పూజలందుకుంటున్న బంగారమ్మ తల్లి

కొత్తవలస: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్, ఇతర ఇంబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని రాయుడుపేటలో గ్రామదేవత బంగారమ్మతల్లి తీర్థమహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది. ఎడ్ల పరుగు ప్రదర్శనలో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 15జతల ఎద్దులు పాల్గొన్నాయి. వావిలపాడుకు చెందిన గండివెంకటరావు ఎడ్లు మొదటి స్థానంలో, ద్వితీయ స్థానంలో వల్లంపూడికి చెందిన శానాపతినాయుడు ఎడ్లు తృతీయస్థానంలో వల్లంపూడికి చెందిన బండి నాయుడు ఎడ్లు నిలిచి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు బహుమతిని గెలుచుకున్నాయి. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన ఎడ్లుకు రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలును ఆయా ఎద్దుల యజమానులకు గ్రామపెద్దలు అందజేశారు. తీర్థం సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



వేపాడ: పరుగు ప్రదర్శనలో పరుగు తీస్తున్న ఎద్దులు

24,25వ తేదీల్లో సాంబమూర్తి తీర్థం

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి ఆలయం వద్ద ఈ నెల 24, 25వ తేదీల్లో తీర్థమహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 24న రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం పారిశుద్ధ్య కార్మికులకు సన్మానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న ఎడ్ల పరుగు ప్రదర్శన, అలాగే సైకిల్, బైక్ స్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు 28 మంది ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

గంట్యాడ: విశాఖపట్నం జిల్లాలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి మహిళల, పురుషుల జట్లను స్థానిక ఉన్నత పాఠశాలలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 110 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కాగా పురుషుల జట్టుకు 14 మందిని, మహిళల జట్టుకు 14 మందిని ఎంపిక చేశామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.నాగేశ్వరావు తెలిపారు.

కొండశంబాంలో వైద్యశిబిరం



చీపురుపల్లిరూరల్: శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండశంబాం గ్రామంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు శ్రీరామ్మూర్తి కొండశంబాం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి ఆ ఆస్పత్రికి చెందిన వైద్యబృందం సేవలు అందించారు. గ్రామస్తులకు వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక త్రినాథ్, మాజీ సర్పంచ్ సంఘమయ్య, జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు చిరంజీవి, సభ్యుడు ఉమాశంకర్, ఆశయసంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో..

శృంగవరపుకోట: మండలంలోని లచ్చందొరపాలెం, కొత్తమరుపల్లి, మూలబొడ్డవర, గ్రామాల్లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు త్రినాథరావు, శ్రీరామ్మూర్తి, సూర్యనారాయణ, సత్యంనాయుడు, నాగలక్ష్మి తదితరులు 180 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్తపరీక్షలు చేశారు. అలాగే 350 మందికి చీరలు పంపిణీ చేశామని జిల్లా సేవాదళ్ రమణ తెలిపారు. విజయనగరం సత్యసాయి సేవా సంస్థలు, స్వామినామ సంకీర్తన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా భవనాల తొలగింపు, విద్యుత్ పనులు



రోడ్డు విస్తరణలో భాగంగా భవనాల తొలగింపు పనులు



టవర్ స్తంభాలకు విద్యుత్ వైర్లను అమర్చుతున్న సిబ్బంది

గజపతినగరం: మండల కేంద్రంలో రహదారి విస్తరణకు సంబంధించిన పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ, భవనాల తొలగింపు పనులు ఆదివారం పునఃప్రారంభమయ్యాయి. భవనాలకు మార్కింగ్ ఇచ్చి వాటి తొలగింపు పనులను తొలుత అధికారులు ప్రారంభించారు. అయితే జేసీబీతో భవనాలను తొలగిస్తుండడంతో మొత్తం భవన నిర్మాణం దెబ్బతింటోందని వాటి యజమానులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో భవనాలను మార్కింగ్ చేసినంత వరకు వాటిని తొలగించుకునే అవకాశం యజమానులకే ఇచ్చారు. భవనాల యజమానులు మొత్తం భవన నిర్మాణం దెబ్బతినకుండా మార్కింగ్ పరిధి వరకు తొలగింపును డ్రిల్లింగ్ యంత్రాలతో చేయిస్తున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ సిబ్బంది కొత్తగా ఏర్పాటు చేసిన భారీ టవర్ విద్యుత్ స్తంభాలకు విద్యుత్ లైన్లను అమర్చే పనులను జోరుగా చేపడుతున్నారు.



గౌరమ్మ వీధిలో కుళాయిలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాగునీటి కుళాయిల ఏర్పాటు

వేపాడ: మండల కేంద్రంలోని గౌరమ్మ వీధిలో సర్పంచ్ మిరపాక అర్జునమ్మ, వార్డుమెంబర్ మిరపాక రమణ ఆధ్వర్యంలో ఆదివారం తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. పంచాయతీ నిధులతో పైపులైను వేసి 10 ట్యాప్‌లు అమర్చారు. అలాగే గ్రామంలో అన్ని వీధుల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ చెప్పారు.

26న మందిర నిర్మాణానికి భూమిపూజ

శృంగవరపుకోట: పట్టణంలోని దత్తసాయి మందిరం వద్ద జిల్లెలమూడి అమ్మ మందిరం నిర్మాణానికి ఈనెల 26వ తేదీ ఉదయం భూమిపూజ చేయనున్నట్లు శృంగవరపుకోట బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గార్లపాటి సత్యసాయి ఆదివారం తెలిపారు. గ్రామ పురోహితులు విన్నకోట భాస్కరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ వాసులు, భక్తులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు సోంపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్యక్రమానికి మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంలో మెంటాడ రోడ్డు జంక్షన్, వెంకటగాయత్రీ రోడ్డు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్లాల్లోనే జియోట్యాగింగ్

బొండపల్లి: గ్రామాల్లో నూర్పులు పూర్తయి, రైతులు ఇంకా కల్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలను రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు జియోట్యాగింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు ఓ ప్రకటనలో సూచించారు. ఈ–క్రాప్‌లో వరి పంటను నమోదు చేసుకున్న రైతుల్లో వరి నూర్పులు పూర్తి చేసి కల్లాల్లో ఉంచిన బస్తాలను ఫొటోలు తీసి ట్యాంగిగ్ చేయాలని, తక్షణమే అన్నీ రైతు భరోసా కేంద్రాల పరిధిలోనూ ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయండి

శృంగవరపుకోట: సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26న ఎస్.కోటలో నిర్వహించనున్న ట్రాక్టర్ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి మద్దిల రమణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఎస్.కోటలో విలేకరులతో మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడం నిలిపివేయాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అంతా ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

కెంగువలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామంలో సచివాలయ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామం లోని అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను కార్మికులు తొలగించారు. పనులను స్థానిక వైఎస్సార్‌సీపీనాయకుడు లెంక గణేష్ పర్యవేక్షించారు.

విదేశాలకు ఎగుమతిచేసే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి

లక్కవరపుకోట: రేగ పంచాయతీ పరిధిలో సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిరుధాన్యాల ప్రోసెసింగ్ యూనిట్ విదేశాలకు చిరుధాన్యాల ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని మార్కెటింగ్ అండ్ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి ఆకాంక్షించారు. చిరుధాన్యాల ప్రోసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల చెల్లెల్ల సంఘంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, భవిష్యత్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. ఇంత మంది చెల్లెల్లు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు కావడం, ఇంత పెద్ద ప్రోసెసింగ్ యూనిట్ నిర్మించుకోవడం అభినందించదగ్గ విషయమని, మహిళలందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. యూనిట్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకాలు పూర్తిస్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా మార్కెటింగ్ జేడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రోసెసింగ్ యూనిట్‌ను త్వరలో పూర్తి చేసి, ప్రమాణాలు పాటిస్తూ వినియోగదారులకు మంచి ఉత్పత్తులు అందించి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. సబల స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కె.సరస్వతి తమ సంస్థ ద్వారా చిరుధాన్యాల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహం, తయారు చేస్తున్న ఉత్పత్తులు, సంఘం వ్యాపార లావాదేవీలను వివరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం డీసీబీసీ సీఈఓ వర్మ, మార్కెటింగ్ ఏడీఏ శ్యామ్, సబల స్వచ్ఛంద సంస్థ వైస్ ప్రెసిడెంట్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

• థాంక్యూ సీఎం సార్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయుడుబాబు, తదితరులు

కొత్తవలస: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు. కొత్తవలసలో నాయుడు బాబు క్యాంపు ఆఫీస్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితవాడ పంచాయతీ సాధన దిశగా కృషి



మాట్లాడుతున్న ఎయిమ్ జిల్లా ఇన్‌చార్జి సీతబాబు

చీపురుపల్లిరూరల్: దళితవాడ పంచాయతీ సాధన దిశగా అంబేడ్కర్ ఇండియా మిషన్(ఎయిమ్) కృషి చేస్తోందని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి అడ్డూరి సీతబాబు, జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు అన్నారు. మండలంలోని పెదనడిపల్లి దళితవాడలో ఎయిమ్ సంస్థ ఆధ్వర్యంలో ' మన వాడ– మన పంచాయతీ, మన పాలన ' అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేస్తేనే దళిత ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనే ఎయిమ్ లక్ష్యమన్నారు. దళితులు ఐకమత్యంతో ఉండి హక్కులను కాపాడుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సర్పంచ్ ఎస్.పోలిరాజు,ఎంపీటీసీ ఆర్.నారాయణరావు, గుర్ల,మెరకముడిదాం మండలాల ఎయిమ్స్ కన్వీనర్లు టి.నారాయణప్పడు, సిర్ది రాము, పొట్నూరు రామన్న పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు

జామి: మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన యువకుడు సారిపల్లి ఈశ్వరరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించు కుంటున్నారు. బాధితుడిది నిరుపేద కుటుంబం కావడంతో గతంలో కుమరాంలో పని చేసి ప్రస్తుతం పినతాడివాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తు న్న జగదీష్, జె.డి.వలస పంచాయతీ కార్యదర్శి శివకుమారి ఆయనికి వైద్య ఖర్చుల కోసం సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. తమ తోటి స్నేహితుల సహకారంతో రూ.25 వేలు సమకూర్చి, ఆ నగదును సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ కంది పద్మావతి చేతులు మీదుగా బాధితుడికి ఆదివారం అందజేశారు. గొడికొమ్ము పంచాయతీ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ప్రసాద్, గ్రామపెద్దలు పి.రవికుమార్, కంది నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ పోటీల్లో టీచర్‌కు బహుమతి



మొదటి బహుమతి సాధించిన రామచంద్ర గీసిన చిత్రం

కొత్తవలస: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సాహిత్య విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రామచంద్రకు బహుమతి వరించింది. ఈయన గీసిన 'తల్లి అనే పదానికి కనీసం ఒక పర్యాయ పదం చెబితే ఈ జాబ్ నీదే' అనే వంగ్య చిత్రానికి మొదటి బహుమతి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ హైకోర్టు న్యాయమూర్తి ఎ.దుర్గాప్రసాద్, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, తానా నిర్వాహకుల చేతుల మీదుగా నగదు బహుమతితో పాటూ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల బోధనా సిబ్బంది రామచంద్రను అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాస్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని చెప్పారు. అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.